# విజయం

సత్యకి భర్త గురించి ఆలోచిస్తుంటే ఇప్పటకీ ఆశ్చర్యంగానే ఉంటుంది. చిన్నప్పుడు పెరిగిన ఆ పల్లెటూరి ప్రభావం ఇంకా ఆయన్ని అంటిపెట్టుకునే వుందేమిటా అని. కాలవ గట్లని, పొదుల్ని, మొక్కల్ని తల్చుకు పరవశించే భర్తని చూసి నవ్వుకుంది కూడా. ఇంత పెద్ద పట్నంలో వుంటూ కుడా, పల్లెల్లో వున్నట్టే వుండాలనుకోవటం ఎంతో వెర్రితనంగా భావిస్తుంది సత్య.

సత్య పొదుపుగా సంసారం చేస్తూ, డబ్బు కూడబెట్టి, కూడబెట్టి చాలా ఏళ్ళ నాడు అరొందల గజాల స్థలం, స్నేహితురాలి ప్రోద్భలంతో కొనుక్కొంది. భార్య పట్టుదల వల్ల అంగీకరించాడు రామం.

ఇంతకాలానికి ఇల్లు కట్టాలనే ఆలోచన రావటమే మహాభాగ్యంగా మురిసిపోయింది సత్య. భర్త ఆఫీసు కెళ్ళగానే ఇంటి పనులు పూర్తిచేసుకుని స్థలం దగ్గరకెళ్ళిపోతుంది సత్య ఎంతో ఉత్సాహంగా, పనివాళ్ళ దగ్గర నిలబడి పనులు చేయించటం, ఎక్కడ ఏ వస్తువు దొరుకుతుందో, ఎంత చౌకగా దొరుకుతుందో కనుక్కోవటం లాంటి వన్నీ సత్య చకచకా చేయగలదు. అంతేకాదు, మగవాళ్ళకన్నా ఆడవాళ్ళు చాలా సమర్థంగా పనులు నిర్వహించగలరని సత్యకి గొప్ప నమ్మకం. అదీ మంచిదేలే అనుకొని హాయిగా వుండడం రామానికీ బాగుంది. కానీ, రామాన్ని చూస్తే ఈ మధ్య ఒళ్ళు మండి పోతోంది సత్యకి.

అదీ ఒకందుకు మంచిదేలే అంటూ మరీ హాయిగా పడక కుర్చీలో పడుకుని పేపరు చూసే భర్తను చూస్తుంటే వళ్ళు మండిపోతుంది సత్యకి.

పడమటి వైపు స్థలం ఖాళీగా వుంచుదామంది భర్తతో. సరే అన్నాడు వెంటనే. ఇల్లు కట్టాక ఆ పడమటి వైపు స్థలంలో చక్కని 'లాన్' వేసుకోవచ్చునే కలలు కంటూ రోజూ ఆ స్థలాన్ని చూస్తూ వుండేది సత్య. ఆదివారం అంటే మహా యిష్టం రామానికి. గడియారం వంక చూడకుండా రోజంతా గడపాలని అతని కోరిక. ఈలపాట పాడుకుంటూ గడ్డం చేసుకోవచ్చు. షవర్‌బాత్ గంట పైగా చేయొచ్చు. ఆ తర్వాత స్నేహితులతో పేకాట ఆడుకోవచ్చు. ఏ రెండు గంటలకో భోజనం చేసి హాయిగా నిద్రపోవచ్చు. కొన్ని సుఖాలు యిచ్చే ఆదివారం రామానికి నిజంగా యిష్టం. కానీ యిల్లు కట్టడం మొదలు పెట్టిన తర్వాత ప్రతి ఆదివారం స్థలం దగ్గరికి లాక్కుపోతుంది సత్య.

ఇంటి పనులన్నీ పూర్తి చేసుకొని ఫ్లాస్క్ లో కాఫీ పోసుకుంది. అక్కడి కెళ్ళాక యిద్దరూ తినడానికి ఏదో ఒక టిఫిన్ చేసేది. వెళ్తున్నంత సేపు పడమటి వైపు వేయబోయే 'లాన్' గురించి రకరకాలు ఆలోచనలు చేసేది.

సత్య గబగబా నడుస్తూ అందమైన లాన్, ఓ ప్రక్కన తూగుడు ఉయ్యాల, మరో వైపు రెండు కుర్చీలు – వాటిలో తనూ, తన భర్త, కాళ్ళ దగ్గర చిన్న కుక్కపిల్ల. కారిడార్‌లో అందమైన చిన్న ఎర్రకారు. అమెరికా నుంచి వచ్చిన చిన్న మనుమరాలిని ఒళ్ళో కూర్చోపెట్టుకుంటే – సత్య ఉలిక్కిపడి నడవకుండా ఆగిపోయింది. బస్సు హారన్ మ్రోగుతోంది. ముఖాన పట్టిన చెమట తుడుచుకుంటూ, స్థలం చేరుకుంది.

పడమటి వైపు స్థలంలో పునాదుల కోసం ముగ్గు పోయిస్తున్న భర్తని చూడగానే ఒకింత ఆశ్చర్యపోయింది సత్య. తన భర్త మహాతెలివైనవాడు. పైకి అలా నిర్లిప్తతగా కన్పిస్తాడు. గొప్ప ముందు చూపుంది. ఒకేసారి రెండిళ్ళూ కట్టేసుకుంటే ఖర్చెంతో కలిసొస్తుంది మరీ – ఆ లాన్ సంగతి తర్వాత చూసుకోవచ్చు. ఆనందంతో మురిసిపోతూ, భర్త ప్రక్కన వచ్చి నిలబడింది సత్య.

"అంత డబ్బెక్కడిదీ" అంది నెమ్మదిగా!

"దీనికెంత కావాలి" అన్నాడు రామం.

"అంటే!" అంది కొంచెం విస్తుపోతూ.

"అంత ఇళ్ళూ యిప్పుడే కడితే బరువు కాదూ" అంది

రామం మాట్లాడలేదు. "ఇంతకు ముందు చాలాసార్లు అనుకున్నాంగా" అన్నాడు నసుగుతూ.

"ఏమనుకున్నాం?" – ఏమనుకున్నారో తనకి తెలియనట్టు సత్య అతనికేసి చూసింది. రెండు గేదెల్ని పెంచుకుంటే వాటిమీద కొంత ఆదాయమూ వస్తుంది. నువ్వు రోజూ కష్టపడి ఆ పాల బూతు దగ్గర నిలబడకుండా నీకు హాయిగా వుంటుంది. నీకు కావలసినంత పాడి. అసలు ఈ పట్నం వచ్చాక గడ్డ పెరుగంటే తెలియకుండా పోయింది. నా చిన్నప్పుడు మా యింట్లో..."

ఆ తర్వాత రామం చెప్తున్న ఏ ఒక్క మాట సత్యకి వినిపించలేదు. తన అందమైన లాన్‌లోకి గేదెలు పరుగెత్తి తొక్కిపాడు చేస్తున్నట్లు అనిపించి ముఖం వెలవెలబోయింది.

హాస్యానికి అంటున్నాడేమో అనుకుంది కానీ –

"నేను అన్నీ లెక్క వేశాను. ఖర్చులు పోనూ నెలకి రెండు వేలు మిగుల్చుకోవచ్చు తెల్సా" – రామం అలా అంటూనే ఫ్లాస్క్‌లో కాఫీ ఒక కప్పులో పోసుకుని, మరో కప్పు సత్యకి అందించాడు.

సత్యకి విషయం పూర్తిగా అర్థం అయిపోయింది. రామం ఎంత మంచివాడో, అంత మొండివాడని కూడా తెల్సు. చతుర్విధ ఉపాయాల్లో ఏది ప్రస్తుతం పనికి వస్తుంది అని ఆలోచిస్తూ రోడ్డు వంక చూస్తూ కూర్చుంది సత్య.

గొడ్లపాక, గేదెలు, పిడకలు, గడ్డి - సత్య కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయ్. తన చిన్నతనం అంతా బెంగుళూరులో చిన్న ఫ్లాటులో గడిచిపోయింది. ఇప్పుడైనా మంచి యిల్లు. అందమైన లాన్ అనేది వుంటుందనుకుంది. సత్య చాలా తెలివైంది, సమర్థురాలు కూడా. ఏ పరిస్థితినైనా, చక్కడా ఎదుర్కోగల సమయస్ఫూర్తి కూడా వుంది.

"తినండి మీకిష్టమని చేసి మరీ తెచ్చాను" అంది సమోసాలు ప్లేటులో పెడుతూ.

"చాలా బావున్నాయ్. వాళ్ళకీ రెండు పెడదామా అన్నాడు దూరంగా వున్న పనివాళ్ళని చూపిస్తూ. ఆ మాటని వినిపించుకోకుండా, "మనం గేదెల్ని పెంచుకోవడం ఏమిటి చెప్పండి" అంది చాలా నెమ్మదిగా సత్య.

"అన్నీ నాకు తెల్సులే ఊరుకో. నా చిన్నప్పుడు ఎన్ని గేదెలు, ఆవులు మా దొడ్లో వుండేవో నీకేం తెల్సు. ఆ పాలూ, గడ్డ పెరుగు, ఆ రుచే వేరులే. సెలవుల్లో మేమంతా వెళ్ళినప్పుడు మా నాయనమ్మ వెన్న చేసి మా అందరికీ పెట్టేది".

రామం మాటలు ఎంతో కోపాన్ని తెప్పిస్తున్నా సత్య నవ్వుతూ "మీరెప్పుడైనా పాలు పిండేరా" అంది.

"నాకేం ఖర్మ. నాకు పాలేర్లు, నౌకర్లు, వాళ్ళూ, వీళ్ళూ. ఒక్కసారి కూడా... ఆ ఒక్కసారి నేను పదో తరగతి చదువు తున్నప్పుడు..."

సత్య పకపకా నవ్వింది - "గేదె తన్నిందా!"

"నీ మొహం ఎందుకు తంతుందీ!"

"నాకేం తెల్సు - పాలు పిండుతుంటే అప్పుడప్పుడూ గేదెలు తంతాయని విన్నాను" - సత్య ఈ మాటటురగబడి నవ్వింది.

రామానికి తన చిన్ననాటి పోట్లావు గుర్తొచ్చింది. రామం ఏదో ఆలోచిస్తున్నాడు.

"ఒకవేళ ఎప్పుడైనా పనివాళ్ళు రాకపోతే?"

రామం మాట్లాడలేదు.

"పాలు తీస్తుంటే వేళ్ళు నెప్పి పుట్టవూ - సత్య ముఖం చిరాగ్గా పెట్టి అంది. "పేడ, గడ్డి" అప్రయత్నంగా ముక్కు మూసుకుంటూ రామం వంక చూసింది.

"అన్నీ వాడే చూసుకుంటాడు" కసిరినట్టే చిరాగ్గా అన్నాడు రామం.

"వాడు రాలేదనుకోండి అప్పుడు మరి?"

వేయబోయే గొడ్లపాక గురించి, అందులో వుండే ఆవులూ, గేదెలూ గురించి సత్య వ్యతిరేకంగా మాట్లాడడం రామానికి కోపాన్ని కల్గించింది.

'గొడ్లపాకలో వుండే గేదెలకు పనివాళ్ళు రాకపోతే, తను పనులు చేయాల్సి వస్తుందనా దీని భయం' – చేతిలో వున్న సిగరెట్ విసిరికొట్టి, "ఈ గొడ్లపాక, గేదెలూ, ఆవులూ వీటి బాధ్యత అంతా నాదే. నువ్వే మీ చేయ్యనక్కరలేదు సరేనా!" అన్నాడు కోపంగా.

పనివాళ్ళ మధ్యకు వెళ్ళిపోయి మాటల్లో మునిగిపోయిన రామాన్ని చూస్తూ తన మాటలేవి పనిచేయలేదనీ, మరేదైనా ఉపాయం ఆలోచించాలని వీధి వైపు చూస్తోంది సత్య. అలా చూస్తూ వుండగానే కొండంత బలం వచ్చినట్లనిపించింది సత్యకి. దేవుడు లేడూ?! సమయానికి రక్షిస్తాడు.

"ఇలా రా!" కేక పెట్టింది.

అటుగా పోతున్న పాల రంగయ్య యిటువైపు వచ్చి సైకిలు దిగాడు.

దగ్గర్లో నుంచొన్న రామం కూడా రంగయ్య దగ్గర కొచ్చాడు.

పాల వ్యాపారం మొదలు పెట్టినప్పుడు కొంత డబ్బు సాయం చేశాడు రామం చాలా రోజుల నాడు.

రంగయ్య అలా కనిపించడం తన అదృష్టంగా భావిస్తూ "బాగున్నావా!" అంది చాలా సంతోషంగా సత్య.

"నీ వ్యాపారం బావుందా!" అని, ఫ్లాస్క్‌లో కాఫీ భర్త కందిస్తూ, "కూర్చో!" అంది. అక్కడో రాతి మీద కూర్చున్నాడు రంగయ్య.

"ఏం వ్యాపారం అమ్మగారూ' పది గేదెలు చచ్చిపోనాయండి'

"అయ్యోపాపం!" – నత్య రామం వంక చూస్తూ, "యింకొంచెం పొయ్యనా" అంది ఫ్లాస్క్‌ని చూస్తూ.

రామం ఆ మాట వినినపించుకోలేదు.

"ఢిల్లీ గేదెలకి ఎప్పుడు ఏ జబ్బు వస్తుందో తెలియదు కదండీ! అన్ని వేలూ బూడిద పాలైపోయాయి. ఆ బెంగతో నా భార్య మంచం పాలయిందండి."

"ఊ..." చెక్కిలి పై చెయ్యి వేసుకుని శ్రద్ధగి వింటుంది సత్య.

"నాకు వంట్లో బాగోక జీతగాడ్ని పెట్టాను. నాకు ఆరు లీటర్లు యిచ్చేవి, వాడికి రెండు లీటర్లు కూడా యిచ్చేవి కావు. అబ్బబ్బా ఏమి తిప్పలో. ఈ వ్యాపారం కాదు కానీ బుద్దొచ్చిందమ్మా! దండగ వ్యాపారం"

రామం కల్పించుకుని, "అయితే యిప్పుడేం చేస్తున్నావ్" అన్నాడు రంగయ్యతో "బుద్ధున్నవాడెవడూ ఈ వ్యాపారం చెయ్యడండీ! నాలుగు డబ్బులు బ్యాంకులో వేసుకుని ఆ వడ్డీతో సుఖంగా బతక్కా..." రంగయ్య ఏదో చెప్తూ సైకిలు దగ్గర కొచ్చాడు.

"ఉండు రంగయ్యా యివి తిను" - సమోసాలు కాగితంలో పెట్టి అందించింది. అవి కాగితంలో చుట్టుకుని సంచిలో వేసుకున్నాడు రంగయ్య.

"రంగయ్యా! అప్పుడప్పుడూ కన్పిస్తూ వుండు" అంది సత్య.

రామం వంక చూసింది.

చేతిలో వున్న సిగరెట్ కాలి వేళ్ళు చుర్రుమన్నాయ్. కళ్ళజోడు సరిచేసుకున్నాడు రామం. సత్య లోపల వస్తువులు సర్దుతుంటే, "గొడ్లపాక సంగతి యింకోసారి చూద్దాంలే - ఆలోచించి చెప్తాను రేపేమి పని మొదలు పెట్టొద్దు". నెమ్మదిగా మేస్త్రీతో అని రెండడుగులు వేశాడు రామం. "ఉండండి నేనూ వస్తున్నాగా!" అంది సత్య విజయగర్వంతో భర్త వంక చూస్తూ.

రంగయ్య పాల వ్యాపారం దెబ్బతిన్న విషయం రెండు నెలలనాడే సత్యకి తెల్సన్న విషయం రామానికేం తెల్సు! కానీ ఆడవాళ్ళు ఎంత తెలివైన వాళ్ళో గ్రహించలేకపోలేదు రామం.

'విజయం సాధించటం అయింది' అని మనసులో మురిసిపోయింది సత్య.

- రచన ఇంటింటి పత్రిక సెప్టెంబర్ 2005